క్లుప్తంగా

దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఆటో కార్మికులు ఉద్యమించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఆటో కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యల్.నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగరంలోని పాత రిమ్స్ ఆటో స్టాండ్ కార్మికులకు ఏఐటీయూసీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, పుల్లయ్య, ఆవుల నారాయణ, నాయకులు అంకుశం, పాత రిమ్స్ ఆటో స్టాండ్ నాయకులు నారాయణస్వామి, శివకృష్ణ, శంకర్ నాయక్, రవి నాయక్, చంద్ర, లాడెన్, ఎస్.జిలాని బాషా, రాము, శివమల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గా ఉరుసుకు ఆహ్వానం



కడప కార్పొరేషన్ : కడప నగరంలో ప్రసిద్ధిగాంచిన అమీన్‌పీర్ దర్గా(పెద్దదర్గా) ఉరుసుకు హాజరు కావాలని దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేనీ కోరారు. మంగళవారం మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆయనకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

శ్రమదానం

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-9 ఆధ్వర్యంలో వలంటీర్లు శ్రమదానం చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యాలయ ప్రాంగణంలోని గురుకులంలో పిచ్చి మొక్కలు తొలగించి, చెట్లకు పాదులు తీశారు. ఆయా విభాగాల వద్ద ఉన్న ముళ్లకంపల్ని తొలగించారు. కళాశాల ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డి వలంటీర్లను అభినందించారు.

డీవైఎఫ్ఐ సమావేశాలను జయప్రదం చేయాలి

వైవీయూ : కడప వేదికగా ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. మంగళవారం వైవీయూలో సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాలకు ఎంపీ రహీం ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన సమస్యలు, కడప ఉక్కు తదితర హామీల అమలే అజెండాగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు అబ్దుల్, నవీన్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ముంబయిలో ఉంటున్న డాక్టర్ ముక్కు కిరణ్మయి సహాయ సహకారాలతో స్థానిక ప్రముఖులు ఉదయభాస్కర్ నగరంలోని చిన్నారులు, అనాథలకు దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం ఆయన నగర శివారులోని మా అమ్మ ఒడి అనాథ బాలల ఆనంద నిలయానికి వెళ్లి అక్కడ ఉంటున్న చిన్నారులకు టీ షర్టులు, నైట్ ప్యాంట్లను అందజేశారు. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న యాచకులు, అనాథలకు వాటిని పంపిణీ చేశారు.

నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అంగన్‌వాడీ కేంద్రాలకు పౌర సరఫరాల సంస్థ నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మంజుల, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర కార్యదర్శి యు.మద్దిలేటి పాల్గొన్నారు.

రైతు కుదేలు



వర్షాల ధాటికి నేలకొరిగిన వరి పంట

- కళ్ల ముందే వర్షార్పణమైన వరి
- కడప మండలంలో నీట మునిగిన 200 ఎకరాల పంట
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

కడప అగ్రికల్చర్ : ఆరుగాలం కష్టపడి స్వేదాన్ని చిందించి పంటలు సాగు చేస్తున్న అన్నదాతలకు తీరా పంట చేతి కొచ్చే సమయానికి.. ప్రకృతి వారిని గాయాల పాలు చేసి అప్పుల ఊబిలోకి నెట్టుతోంది. చివరకు సాగుకు సంబంధించి పెట్టుబడి ఖర్చులు కూడా రాకుండా అప్పులే మూటగట్టుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఇటీవల ఐదు రోజుల క్రితం వాయుగుండం ప్రభావంతో వచ్చిన వర్షాలు చాలా మంది రైతులకు ఇదే పరిస్థితి మిగిల్చింది. కళ్ల ముందే పంటంతా వర్షాలపాలైయింది. చివరికి అప్పులనే మిగిల్చింది. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

కడప మండల పరిధిలో..

ఈ ఏడాది పై ప్రాంతాలలో కురిసిన ముందస్తు వర్షాలతో పెన్నానదికి నీరు వచ్చి చేరింది. దీంతో కడప మండల పరిధిలో పాతకడప, మోడమీదిపల్లె, నానాపల్లి, వాటర్‌గిండి, ఉక్కాయపల్లెతో పాటు ఇంకా కొన్ని గ్రామాల పరిధిలో పెన్నానది పరీవాహక ప్రాంతంతోపాటు పిల్లర్ల కింద చాలా మంది రైతులు వెనక, ముందు 15 వందల ఎకరాలకు పైగా మందస్తుగా వరి పంటను సాగు చేశారు.



నీట మునిగిన పంటను చూపుతున్న రైతులు

సాగు చేసిన వరి పంట రోజురోజుకు ఏపుగా పెరుగుతూ కళ్లముందే కళకళలాడుతుంటే రైతన్నలు చూసి మురిసిపోయారు. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఆశపడుతూ కలలు కన్నారు. వారి ఆశలు, కలలు కళ్లముందే చెదిరిపోయాయి. చివరకు వర్షాలు వారి కలలను చిదిమేసి వరి పంటనంతా నీటిపాలు చేసి అప్పుల ఊబిలోకి నెట్టేసింది. కొంత మంది రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం కష్టంగా మారడంతో ఆందోళన చెందుతున్నారు.

200 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట

కడప మండల పరిధిలో పాతకడప, మోడమీదిపల్లెలో ఇటీవల వచ్చిన వర్షాలకు 50 మందికి చెందిన రైతులకు సంబంధించి 200 ఎకరాల్లో వరి పంట పూర్తిగా నీటి మునిగింది. దీంతో రైతుల కష్టం నీటిపాలైంది. మరో నాలుగైదు రోజుల్లో కోతలను ప్రారంభించేందుకు రైతన్నలు సంసిద్ధులవుతున్న తరుణంలో.. ఉన్నట్లుండి వచ్చిన వాయుగుండం వారి ఆశలను నిలువునా ముంచేసింది. రైతు కష్టాలను, ఖర్చులను నీటి పాలు చేసింది. ఇంకా కొన్ని పంటలు నీటిలోనే మునిగి ఉన్నామని కొందరు రైతులు వాపోతున్నారు.

8 ఎకరాల పంట నీటి మునిగింది



నేను సాగు చేసిన 8 ఎకరాల వరి వాయుగుండం ప్రభావంతో కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు నీటి మునిగింది. దీంతో భారీగా నష్టం వచ్చింది. ఈ ఎనిమిది ఎకరాల వరి సాగుకు అన్ని ఖర్చులు కలిసి 2 లక్షలకుపైగా అయింది. మంచి దిగుబడి వస్తుందని 4 లక్షలకు పైనే రాబడి వస్తుందని ఆశపడ్డాను. నా ఆశలు అడియాసలయ్యాయి. ఎకరాకు 10 బస్తాల దిగుబడి కూడా రావడం కష్టమే.

– వి.మునిరెడ్డి, రైతు, పాత కడప

పంట ఇంకా నీళ్లలోనే ఉంది



నేను సాగు చేసిన 10 ఎకరాల వరిలో ఇంకా చాలా పంట నీళ్లలోనే ఉంది. పంటంతా కుళ్లి పోతోంది. అక్కడక్కడా మొసులు కూడా వచ్చాయి. ఈ ఏడాది వరిపంట బాగా ఉంది, మంచి దిగుబడి వస్తుంది. దీంతో ఐదారు లక్షలకుపైగా డబ్బు వస్తుందని ఆశపడ్డాను. నా ఆశ నీళ్లపాలైంది. చివరకు సాగు ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. భారీగా నష్టపోయాను. మమ్మలను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– ఎం.సుధాకర్‌రెడ్డి, రైతు, పాతకడప

ప్రాథమిక నష్ట అంచనాలు పంపాం



వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రాథమిక పంట నష్టానికి సంబంధించిన నివేదికలను అధికారులకు సమర్పించాం. కడప మండల పరిధిలో 200 ఎకరాల్లో వరి పంట దెబ్బతినింది. నేడో రేమో దెబ్బతిన్న పంటలను మళ్లీ పరిశీలించి పూర్తి స్థాయిలో ఎన్యూమరేషన్ చేస్తాం. పంటనష్ట వివరాలను ఉన్నతాధికారుల అధికారులకు సమర్పిస్తాం.

– సురేష్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, కడప

అష్ఫాఖుల్లా ఖాన్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్వాతంత్ర్య సమర యోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఆఫ్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా తెలిపారు. మంగళవారం ఆఫ్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో అష్ఫాఖుల్లా ఖాన్ 124వ జయంతి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మగ్బూల్ బాషా మాట్లాడుతూ 1900 అక్టోబర్ 22న ఉత్తరప్రదేశ్‌లో సంపన్న జమీందారి కుటుంబంలో అష్ఫాఖుల్లా ఖాన్ జన్మించారన్నారు. తెల్ల దొరలను ఈ దేశం నుంచి తరిమేయడమే మన లక్ష్యం అని పోరాడారని పేర్కొన్నారు. దేశ ఐక్యత కోసం తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి అతి చిన్న వయసులోనే ఉరిస్తంభం ఎక్కిన విప్లవ వేగుచుక్క అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గౌస్ పీర్, ఆఫ్ కీ ఆవాజ్ జిల్లా నాయకులు మస్తాన్, నగర అధ్యక్షులు అబిద్ హుస్సేన్, పర్వేజ్ చాను బాషా, అర్షత్ ఇస్మాయిల్, కరీం, కరిముల్లా జమీర్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..



అష్ఫాఖుల్లా ఖాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆఫ్ కీ ఆవాజ్, ప్రజా సంఘాల నాయకులు

అష్ఫాఖుల్లాఖాన్ స్ఫూర్తితో బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక జిల్లా ఐటీఐ కాలేజీలో అష్ఫాఖుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందని పేర్కొన్నారు. కావున ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ విజయ్, నాయకులు ఉదయ్, శ్రీకాంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష, సంస్కృతిపై అభిరుచి పెంచుదాం

కడప కల్చరల్ : బాలల్లో తెలుగుభాష, సంస్కృతి పట్ల అభిరుచి పెంచేందుకే బాలోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బాలోత్సవం సంస్థ జిల్లా అధ్యక్షులు జి.గోపాల్ అన్నారు. మంగళవారం డీఈఓ అనూరాధ తమ కార్యాలయంలో ఈ మేరకు కార్యక్రమాల వివరాలు గల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 9న బాలల్లో తెలుగుభాషా నైపుణ్యాలను పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వారిలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులను జూనియర్స్‌గా గుర్తించి, ట్రాఫిక్ సమస్యలు-పరిష్కారాలు అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. వేమన, సుమతి శతకాల్లోని పద్యాలను ఆలపించే పోటీలో సీనియర్స్‌గా 9, 10 తరగతుల విద్యార్థులకు పద్యాలాపన పోటీ నిర్వహిస్తామన్నారు. వ్యాసరచనలో మత్తు పదార్థాలు-యువతపై ప్రభావం-నివారణోపాయాలు అంశంపై పోటీ నిర్వహిస్తామన్నారు. నాటకరంగ పద్యాలలో శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి పడకసీను ఘట్టాన్ని, సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీను ఘట్టంలోని పద్యాలను ఆలపించాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలు కడప నగరం బాలాజీనగరలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు. జూనియర్స్‌కు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, సీనియర్లకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 వరకు పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు నవంబరు 15న బహుమతి ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నాగమునిరెడ్డి, బాల ఎల్లారెడ్డి, బాలుగారి వెంకటసుబ్బయ్య, ఏ.సుందరయ్య, మధుసూదన, వెంకటేశ్వర్లు, పెద్ద సుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఈఓ అనురాధ

నేడు మహిళా ఉద్యోగుల సమస్యలపై సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అమరావతి జేఏసీ మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీ జనరల్ విజయలక్ష్మి, అసోసియేట్ చైర్ పర్సన్ శివకుమారిరెడ్డి బుధవారం కడపకు రానున్నారని ఏపీ జేఏసీ అమరావతి వింగ్ వైఎస్సార్ జిల్లా చైర్ పర్సన్ మేరి విజయకుమారి, జనరల్ సెక్రటరీ విజయమ్మలు తెలిపారు. మంగళవారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగుల హక్కులు, సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి మహిళా ఉద్యోగులు హాజరు కావాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి బసిరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు నరసింహారావు, ఫారం శివ, రవికుమార్, రసూల్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణప్రసాద్, సంస్థ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం

కడప కల్చరల్ : కడప నగరంలోని విద్యామందిర్ హైస్కూలుకు చెందిన విద్యార్థిని ఆర్.మహాలక్ష్మికి ఇంటాక్ పోటీల్లో ప్రాంతీయ స్థాయి విజేతగా బహుమతి లభించింది. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ ఇటీవల కేంద్ర కార్యాలయంతో కలిసి కడప నగరంలో హైస్కూలు స్థాయి విద్యార్థులకు నిర్వహించిన మై మాన్యుమెంట్ సెర్చ్ పోటీలలో ఆమె ఈ బహుమతిని సాధించారు. మంగళవారం ప్రధానోపాధ్యాయుని ఆర్.శ్రీవాణి, ఇంటాక్ సభ్యులు, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి మహాలక్ష్మికి కేంద్ర కార్యాలయం పంపిన జ్ఞాపిక, సర్టిఫికెట్‌లను అందజేశారు. మిస్టర్ వి సంస్థ నిర్వాహకులు వర్మ, కోటేశ్వరరావు, రాఘవేంద్రవర్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది విజేతను అభినందించారు.

దుప్పట్లు అందజేత

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర శివారులోని ఆజాద్‌నగర్ బృంద వృద్ధాశ్రమంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకులు రషీదాబేగం జన్మదినాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ మహేనూర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ తాహీర్, ఆఫ్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్‌బాషా, బృంద వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు బాల సుబ్బయ్య, మేనేజర్ సుధారాణి, అసోసియేషన్ సభ్యులు అర్జున్‌రెడ్డి, సుల్తాన, రహమతున్నీసా, లైలు పాల్గొన్నారు.

మను కళాశాల అభివృద్ధికి సహకరించాలి

కడప ఎడ్యుకేషన్ : నగర శివార్లలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిని మను కళాశాల అధ్యాపకులు కోరారు. మంగళవారం కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మీర్జా విలయాత్‌అలి, హెచ్ఓడీలు డాక్టర్ హకీముద్దీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్, అబ్దుల్ ఖవ్విలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

వైవీయూ : విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ రాజు, మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ శాంతలు మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం ద్వారా కలిగే నష్టాలు, పడే శిక్షల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



పోస్టర్లు ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్, పోలీస్ అధికారులు

రహదారులపై ఆక్రమణలు తొలగించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రహదారులపై ఆక్రమణలను తొలగించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. ఆక్రమణదారులకు జరిమానాలు విధించాలని పేర్కొన్నారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన నాగరాజుపేట, రైతు బజార్ బ్రిడ్జ్, చిన్న మాచిపల్లి, అలంఖాన్‌పల్లె, రుద్రభారతిపేట, అల్మాస్‌పేట, మున్సిపల్ స్టేడియం ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటేషన్ విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపునీరు నిలవకుండా చర్యలు

ఆర్టీసీ బస్టాండు ఆవరణం, పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకట రమణ పాల్గొన్నారు.



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

రాణించిన కడప బ్యాట్స్‌మన్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది.

- కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టులోని రుత్విక్ కల్యాణ్ 72, నిషాంత్‌రెడ్డి 19 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 17 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.
- కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. పశ్చిమగోదావరి జట్టు 74.3 ఓవర్లలో 112 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 22.4 ఓవర్లలో 82 పరుగులు చేసింది. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడి

కడప అగ్రికల్చర్ : వ్యవసాయ పంటల సాగులో సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఊటుకూరు డాట్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్ పేర్కొన్నారు. మంగళవారం కడప మండలం చెలమారెడ్డిపల్లెలో వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్, ఆత్మ పీడీ విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మోహరాజ్, పావని, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న డాట్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్

సూపర్ సిక్స్ హామీల అమలుపై శ్రద్ధ పెట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శ్రద్ధ పెట్టడంలో విఫలం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలలో రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు, అమ్మకు వందనం, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే అమలు చేయాలని కోరారు. దీపం పథకం కింద ఇవ్వనున్న మూడు సిలిండర్లపై కూడా స్పష్టత లేదని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుక విధానంలో కూడా ఆచరణలో చాలా గందరగోళం ఉన్నదని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా 12వ మహాసభలు డిసెంబర్ 14 ,15 తేదీలలో కడప నగరంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

బీడీ, సిగార్ ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీడీ, సిగార్ ఉత్పత్తులపైన జీఎస్టీని రద్దు చేయాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓబులు పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం బీడీ కార్మికుల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బీడీ చట్టం, బీడీ కార్మిక సంక్షేమ చట్టం రద్దు చేయడం జరిగిందన్నారు. ఈ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్మికులు పీఎఫ్, ఇఎస్ఐకు నోచుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కామనురు శ్రీనివాసులురెడ్డి, బి.మనోహర్, వెంకట సుబ్బయ్య, బి.దస్తగిరిరెడ్డి, రామకృష్ణ రెడ్డి, అబ్దుల్ దేశాయి షబ్బీర్, రామాంజనేయులు, జగన్‌మోహన్‌రెడ్డి, బీబీ, జమీలా రియాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ బీడీ వర్కర్స్ నేత ఓబులు

మానసిక వికలాంగుల కేంద్రం పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి సూచనల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ కడప నగరంలోని వసతి గృహాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ బాలుర గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం, చెన్నూరు బస్టాండు సమీపంలో గల మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, రాష్ట్రీయ సేవా సమితి వికాస్ విహార్, పాత రిమ్స్‌లోగల అల్‌షఫా మానసిక వికలాంగుల పాఠశాల, శంకరాపురంలోని అంధుల పాఠశాల, రామాంజనేయపురంలోని హెలెన్ కెల్లర్ బధిరుల పాఠశాల, ఇందిరానగర్‌లోని పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమం, ద్వారకనగర్‌లోని ఆశ్రయ, ఆకృతి బధిరుల పాఠశాలలను ఆయన పరిశీలించారు. వంటశాలలు, వసతిగదులు, డైనింగ్ హాలు, స్టోర్ రూము, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర గృహం, పరిశీలన గృహం సూపరింటెండెంట్లు, అంధుల పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మానసిక వికలాంగుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రమాదకరంగా రోడ్లు



జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట రోడ్డు పక్కన గుంతలు



జిల్లా జెడ్పీ కార్యాలయం ఎదుట మరమ్మతుకు నోచుకోని రోడ్డు

కడప నగరంలో ఇటీవల కాలంలో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు డ్రైనేజీ పనులు పూర్తి అయినా.. ఆ డ్రైనేజీ పక్కన తవ్విన గుంతల్లో వర్షానికి నీరు నిలవడంతో కంగిపోయి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు రాత్రి పూట రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. సత్వరం పనులు పూర్తి చేసి రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– మహమ్మద్ రఫీ, ఫొటోగ్రాఫర్, సాక్షి

ఆటో కార్మికుల కష్టాలు





కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలకు కష్టాలు అంతా అంతా కాదు. ప్రభుత్వం ఇసుక, మద్యం తదితర ఆదాయం వచ్చే కార్యక్రమాలు చేపట్టడంతో అన్ని వర్గాల ప్రజలలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉండడం తెలిసిందే. నగరంలో అతిపెద్ద కార్మిక వర్గమైన ఆటవాలలపై ట్రాఫిక్ పోలీస్ అధికారులు నూతన పీసీ నంబర్ అంటూ ఆటో యజమానుల నుంచి డాక్యుమెంట్లు, ఆధార్ కార్డు లైసెన్సు, వాహనం రిజిస్ట్రేషన్ పత్రాలు సేకరిస్తున్నారు. నూతన పీసీ నంబర్ వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఆటో వాలాలు చిత్రంలో చూపిన విధంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద క్యూ లైన్‌లో నిలబడి అవస్థలు పడుతున్న దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప

- కడప నగర శివారులోని కాలభైరవపురంలో గురువారం కాలభైరవాష్టమి సందర్భంగా పూజలు నిర్వహించనున్నట్లు బాలాజీరావు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA
I.A.No. 512/2024 / O.S.No.164/2018
A.Pavan Kumar S/o Madhusudhan Rao, age 50 years, Hindu, residing at Plot No. AF5, Sri Nidhi Enclave, Dhodda Kammanahalli main Road, Banner Gulla, Banglore City, Karnataka. ...Petitioner/Plaintiff
Vs
Kavali Sekhar S/o K.V.Subbaiah Age 60years, Hindu, R/at D.No.20/1065-7, Vasavi Residency, Co-operative Colony,Kadapa City. ...Respondent/ Defendant
NOTICE
Whereas the plaintiff filed the suit against the respondent/defendant before the Hon'ble Additional Senior Civil Judge, Kadapa Vide O.S.No. 164 of 2018 and the same is posted for the your appearance on 12-11-2024, all of you hereby directed to appear before the Hon'ble court at 10:30 A.M in person or through your counsel or advocate, otherwise the petition may be decided in your absence.
By order of the Court
JINKA SUBBARAYUDU,
Advocate for the petitioner.